andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8 ၊ కనిష్ఠం 24.2

# ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 16 జూలై 2025

● ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామ పంచాయతీ






# సర్పంచులకు.. అవినీతి మరకలు

- గడిచిన ఐదేళ్లలో రూ.52.77 లక్షలకు పైగా గోల్‌మాల్
- దుర్వినియోగంపై పలు గ్రామ పంచాయతీలకు నోటీసులు
- రికవరీలో తీవ్ర జాప్యం.. పత్తాలేని త్రిసభ్య కమిటీ
- ప్రజాధనాన్ని పక్కదారి పట్టించినా.. చర్యలు కరువు
- రాజకీయ నేతల ఒత్తిళ్లతో వెనుకాడుతున్న అధికారులు
- మళ్లీ పోటీకి సిద్ధమవుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు

"పల్లె ప్రగతిని.. పరుగులు పెట్టించాల్సిన సర్పంచ్‌లే అవినీతికి పాల్పడుతూ అక్రమ సంపాదనకు ఎగబడుతున్నారు. ఎన్నో పాట్లు పడి మరీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత అసలు విషయాన్నే మరిచిపోతున్నారు. కొందరు సర్పంచ్‌లు అధికారంలో ఉన్నప్పుడే నాలుగు పైసలు వెనుకేసుకోవాలనే ఆలోచనలో పడుతున్నారు. ప్రజాసేవను మరిచి స్వలాభం కోసమే పని చేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్‌లపై కఠినమైన చర్యలు చేపట్టక పోవడంతో పంచాయతీల్లో అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదంటున్నారు.



ఆదిలాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో సుమారుగా 15 మంది సర్పంచ్‌లపై అవినీతి ఆరోపణలు రావడంతో జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరుపగా.. రూ.52,77,070ల నిధులు గోల్‌మాల్ అయినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. గతంలోనూ రూ.కోటికి పైగా నిధులు దుర్వినియోగమైనట్లు తేలినా.. ఇప్పటి వరకు ఏఒక్కరిపై రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రతీసారి ప్రజాధనం దుర్వినియోగమవుతున్నా.. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ప్రజాప్రతినిధులే మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.




జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం

### అధికారుల నిండు నిర్లక్ష్యం

గడిచిన ఐదేళ్లలో జిల్లావ్యాప్తంగా మూడు గ్రామ పంచాయతీల్లోనే రూ.52 లక్షలకు పైగా నిధులు దుర్వినియోగమైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఇందులో 2019-24 వరకు ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్(టి) గ్రామ పంచాయతీ పరిధిలో రూ.8 లక్షల 6వేల 616, అలాగే సిరిచెల్మ పంచాయతీ పరిధిలో రూ.8లక్షల 99 వేల 681, ఉట్నూర్ మండలం హస్నాపూర్ పంచాయతీలో రూ.35లక్షల 70వేల 773.. ఇలా మొత్తం రూ.52,77,070 నిధులను పక్కదారి పట్టించడంతో అధికారులు సంబంధిత గ్రామ పంచాయతీలకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. పంచాయతీల పదవీ కాలం ముగిసి రెండేళ్లు గడిచి పోతున్నా.. ఇప్పటి వరకు నయా పైసా రికవరీ చేసిన దాఖలాలు లేవు. గతంలోను ఉట్నూర్ మండలం దంతన్‌పెల్లి, ఇచ్చోడ మండలం బోరిగాం గ్రామ పంచాయతీల పరిధిలో నిధులను దుర్వినియోగం చేసిన సర్పంచ్‌లను తొలగించి తిరిగి ఎన్నికలు నిర్వహించారు. అలాగే మరికొన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను కూడా రద్దు చేశారు. ప్రతీసారి పంచాయతీల్లో అక్రమాలు జరుగుతున్న రికవరీ చేయడంలో అధికారులు నిండు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

**: రమేష్, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్**

గడిచిన ఎన్నికల్లో గెలుపొందిన కొంత మంది సర్పంచ్‌లపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే నోటీసులను జారీ చేయడం జరిగింది. మళ్లీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పంచాయతీల వారీగా లెక్క తీస్తున్నాం. ప్రజా ధనాన్ని వృధా చేసిన వారిపై చర్యలు తప్పవు. పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం అన్ని రకాల చర్యలకు సిద్ధమవుతున్నాం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేయకుండా వేటు వేసేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం.

### ఎన్నికల్లో అడ్డగోలుగా ఖర్చు

భారీ మొత్తంలో ఖర్చు పెట్టి ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు దానిని తిరిగి తీసుకునేందుకు అక్రమ సంపాదన కోసం ఆరాట పడుతున్నారు. ఎన్నికల్లో అడ్డగోలుగా ఖర్చు చేయడం ఆ తర్వాత

(తరువాయి 6వ పేజీలో...)

## ఫటా..ఫట్...

## ముందు జాగ్రత్తగా జిల్లాలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే

● నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్



**ప్రశ్న:** సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

**జవాబు:** సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందు జాగ్రత్తగా ర్యాపిడ్ ఫీవర్ సర్వేను చేపడుతున్నాం. దానను గుణంగా వైద్య సేవలను అందిస్తున్నాం.

**ప్రశ్న:** మునిసిపాలిటి, అర్బన్ ప్రాంతంలో వ్యాధుల నివారణకు ప్రణాళికలు సిద్ధం చేశారా?

**జవాబు:** అర్బన్ ప్రాంతంలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్ర త్యేక యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశాం. ఇందులో భాగంగా పలు సమస్యాత్మక కాలనీలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

**ప్రశ్న:** వర్షాకాలంలో మారుమూల గ్రామాలకు వైద్య సేవల ను ఎలా అందిస్తున్నారు?

**జవాబు:** జిల్లాలో ఎక్కువగా మారుమూల గ్రామాలే ఉన్నాయి. ఇప్పటి వరకు 201 గ్రామాలను కటాఫ్ గ్రామాలుగా గుర్తించాం.ఈ గ్రామాల్లో ఉన్న గర్భిణీ స్త్రీలను బర్త్ వెటింగ్ రూమ్‌లకు తరలించి వైద్యాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

**ప్రశ్న:** ఇప్పటి వరకు జిల్లాలో ఎన్ని డెంగ్యూ పాజిటివ్ కేసులు వచ్చాయి?

**జవాబు:** ఈయేడు జనవరి నుంచి జూలై 15 వరకు జిల్లా వ్యాప్తంగా 20 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో ఎక్కువగా ఈ నెలలోనే ఆరు పాజిటివ్ కేసులు రావడం జరిగింది. వచ్చే ఆగస్టు, సెప్టెంబరులో డెంగ్యూ తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రతీ మంగళ, గురు, శుక్ర వారాల్లో డ్రై డేను నిర్వహిస్తూ స్థానిక ప్రజలకు అవగాహనను కల్పిస్తున్నాం.

**ప్రశ్న:** మారుమూల ప్రాంతాలకు అత్యవసర సమయంలో వైద్య సేవలను అందిస్తున్నారా?

**జవాబు:** ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలను అందించేందుకు 13 జన్మన్ టీంలను ఏర్పాటు చేయడం జరిగింది. వీటి ద్వారా మారుమూల గిరిజన గ్రామాలకు వైద్య సేవలు అందిస్తున్నాం. అలాగే 8 ఆర్‌బీఎస్‌కే టీంలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నాం. అంతేకాకుండా ప్రతీ శుక్రవారం స్కూల్ హెల్త్‌డేను నిర్వహిస్తున్నాం.

**ప్రశ్న:** అత్యవసర సమయంలో వైద్య సేవల కోసం ఎవరిని సంప్రదించాలి?

**జవాబు:** జిల్లా ప్రజలకు అత్యవసర సేవలను అందించేందుకు 24/7 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. ఏమైనా అత్యవసర సేవలు అవసరమైతే ఫోన్ నెం. 7670904306కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి. అదేవిధంగా వెంటనే ర్యాపిడ్ రిఫరెన్స్ టీం వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటుంది.

- ఆదిలాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి)

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నర్సయ్య



నర్సయ్య

బజార్‌హత్నూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి బజార్‌హత్నూర్ మండల వాసీ, మాజీ జడ్పీటీసీ అయిన మల్లెపూల నర్సయ్యకు దక్కింది. ఏడాది పాటుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టుఎట్టకేలకు ఆయనకు దక్కడంతో సంతోషం వ్యక్తం చేశారు. వినయ, విధేయత, నిబద్ధత కలిగి కాంగ్రెస్ పార్టీలో సీనియర్‌గా గుర్తింపు పొంది బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన మల్లెపూల నర్సయ్యకు ఈ అవకాశం దక్కడంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా రెండు సార్లు జడ్పీటీసీగా మండలలో సేవలు చేయడమే కాకుండా గత కొన్నేళ్ల నుంచి పార్టీని అంటిపెట్టుకుని విపక్షంలో ఉంటూ గ్రామీణుల సమస్యలను ఎలుగెత్తి ప్రభుత్వం, జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కాగా ఆశించిన పదవి దక్కడం.. తాను ప్రజలకు చేసిన సేవకు గుర్తింపని, ఈ పదవి అందించిన సీఎం రేవంత్‌రెడ్డికి, జిల్లా ఇన్‌చార్జీ జూపల్లి కృష్ణారావుకు, మంత్రి వివేక్‌తో పాటు సహకరించిన అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు పండ్ల తోటలపై ప్రత్యేక శిక్షణ

మావల, జూలై 15(ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన పరిశోధన స్థానం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో ఎస్సీ రైతుల కోసం ప్రత్యేకంగా పండ్ల తోటల స్థాపనపై రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనునట్లు సీనియర్ శాస్త్రవేత్త డా.మురళీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జూలై 16 (బ్యాచ్-1), అదేవిధంగా జూలై 17న (బ్యాచ్-2) తేదీలలో జరుగనునట్లు తెలిపారు. ఈ శిక్షణలో ప్రతీరోజు ఒక్క విడతకు 150 మంది రైతులు మాత్రమే పాల్గొనాలన్నారు. ఈ శిక్షణలో భాగంగా మామిడి, జామ, అల్ల నేరేడు, డ్రాగన్ ఫ్రూట్ వంటి నాణ్యమైన అంటూ ముక్కలను రైతులు గృహ ప్రాంగణం లేదా వ్యవసాయ భూముల్లో నాటేందుకు ఉచితంగా అందించబడతాయన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లను పెంచాలి

● జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్‌గణేష్

బజార్‌హత్నూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లను పెంచాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్‌గణేష్ అన్నారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన వారు మీ చుట్టు పక్కల ఉన్నత పదవుల్లో ఉన్నారని, కష్టపడి చదువుకోవాలని సూచించారు.కళాశాలల్లో ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల రికార్డులను,రిజిస్టర్లను పరిశీలించారు.వీరి వెంట సూపరింటెండెంట్ షేక్ మోహసిన్, కళాశాల ప్రిన్సిపల్ సునిల్, అధ్యాపకులు ఉన్నారు.

## 20న సిడాం శంభు వర్ధంతి

● విజయవంతం చేయాలి : ఆదివాసీ నాయకులు

ఉట్నూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల ఉద్యమనేత, ఆదివాసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, తుడుందెబ్బ వ్యవస్థాపకుడు, దివంగత సిడాం శంభుపటేల్ 7వ వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు కోరారు. ఈనెల 20న ఉట్నూర్ మండలం మత్తడిగూడలో జరుగనున్న వర్ధంతి కార్యక్రమానికి ఆదివాసీలు అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని శంభు వారసులు సిడాంలచ్చు, సిడాం సోనేరావు, ఆదివాసీ నాయకులు సెడ్‌మకి సీతారాంలు కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇందులో జిల్లా నాయకులు ఆత్రం తిరుపతి, అడా హన్మంత్‌రావు, మడావి మోతీరాం, ఆదివాసీ విద్యార్థులు సంఘ జిల్లా నాయకులు పెందోర్ త్రిమూర్తి, కుంరం వినాయక్‌రావు, పాల్గొన్నారు.

● శంభు విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే సానుకూలం

**ఉట్నూర్:** సిడాం శంభు విగ్రహాన్ని మత్తడి శంభుగూడలో ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సానుకూలంగా స్పందించారు. మంగళవారం ఈ విషయమై గ్రామస్థులు, కుటుంబ సభ్యులు గిరిజన నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందులో శంభు కుమారుడు సిడాంలచ్చు పటేల్, ఆదివాసీ సంఘాల నాయకులున్నారు.

## ఆందోళన విరమించిన వీధి వ్యాపారులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వీధి వ్యాపారం చేసుకుంటు జీవనోపాధి పొందుతున్న తమకు ప్రధాన పార్టీలు మద్దతు ఇవ్వలేదని, తాము వ్యాపారం చేసుకునే వీలు కల్పించిన స్థలంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్న కలెక్టర్ భరోసాతో ఆందోళన విరమిస్తున్నట్లు పట్టణ వీధి వ్యాపారస్థులు మంగళవారం ప్రకటించారు. కాగా ఇటీవల స్థానిక గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్‌లలో వీధి వ్యాపారుల ఆక్రమణలను అధికారులు తొలగించారు.



బోనమెత్తిన ఖత్రి సమాజ్ సంఘం మహిళలు

## ఖత్రి సమాజ్ ఆధ్వర్యంలో బోనాలు

మావల, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఖత్రి సమాజ్ సంఘం కులస్థులు ఆదిత్య ఖండేష్కర్ ఆధ్వర్యంలో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఖత్రి సమాజ్ మహిళలు బోనాలు ఎత్తుకొని శోభాయాత్రగా మహాలక్ష్మి మాత మందిరానికి వెళ్లారు. బోనాల జాతరలో ఖత్రి సమాజ్ కులస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో ఖత్రి సమాజ్ అధ్యక్షుడు ఆదిత్య ఖండేష్కర్, ప్రధాన కార్యదర్శి రాజ్ శ్రీనివాస్, సంఘ నాయకులు సతీష్, పవన్, ఉత్తమ్, కిషోర్, రాజ్ కుమార్, నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఎల్లమ్మ తల్లి కల్యాణం

మావల, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టిసవర్గాం(దుబ్బగూడ) గ్రామస్థులు గౌడ గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మతల్లి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. గత ఐదు రోజులుగా ఎంతో వైభవంగా పూజాది కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మన చారిత్రక సంప్రదాయాలను తెలుసుకోవడంతో పాటు వాటిని ఆచరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతరించిపోతున్న ఎల్లమ్మ ఒగ్గు కథలు, జానపద కళలకు జీవం పోసేలా ఆధ్యాత్మికతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, భూపతి గౌడ్, పరశురామ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దినేష్, అక్షయ్, నాగరాజ్ గౌడ్, దేవేందర్ గౌడ్, సాయి చైతన్య గౌడ్, నరేష్ గౌడ్, రమేష్ గౌడ్, తదితరులున్నారు.

## స్వచ్ఛందంగా కదిలిన యువత

ఇచ్చోడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మేము సైతం అంటూ ఇచ్చోడకు చెందిన పలువురు యువకులు, నాయకులు, సనాతన సేవా సమితి సభ్యులు స్వచ్ఛందంగా తరలి వచ్చి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాదాపూర్ గ్రామానికి చెందిన నారాయణ మహరాజ్ నేతృత్వంలో సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని శ్మశానవాటికలో స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్మశానవాటికలో పేరుకు పోయిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛతను పాటించాలని, వర్షాకాలం వ్యాధులబారీన పడకుండా జాగ్రత్తలు వహించాలని మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి శీరిష్‌రెడ్డి, సనాతన ధర్మ సేవాసమితి సభ్యులు ముక్కావార్ శ్రీనివాస్, రమేష్, నాందేవ్, మౌళి, రవి, రమణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న సనాతన సేవా సమితి సభ్యులు

# ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమే..

● కలెక్టర్ రాజర్షి షా ● నార్నూర్ మండలం తాడిహత్నూరులో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ ● పాల్గొన్న అధికారులు, నాయకులు

నార్నూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్ పామ్ సాగు చేయడం వలన మంచి లాభాలు పొందవచ్చని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మండలంలోని తాడిహత్నూరు గ్రామం వద్ద ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ 2025 మహోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 80 ఎకరాల ఆయిల్ పామ్ సాగును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 25 మంది రైతులు సుమారుగా నాలుగు వేల మొక్కలను పంట పొలాల నాటారని తెలిపారు. ప్రభుత్వ పరంగా రైతులకు మొక్కలు, బిందు సేద్య పరికరాలపై రాయితీకి అందిస్తుందన్నారు. తోటల నిర్వహణ, అంతర పంటలో భాగంగా యాజమాన్యానికి ఎకరానికి ఈ మొక్కలను నాలుగు సంవత్సరాల పాటు అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. నార్నూర్‌ను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఉద్యాన శాఖ ధృడ సంకల్పం ఉందన్నారు. నీతి అయోగ్ ఏబీపీ ప్రోగ్రాం కింద నార్నూర్ మండలం అభివృద్ధిలో ముందడుగు వేస్తోందన్నారు. ఉద్యాన వన శాఖ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచే, పోషకాహార భద్రత కల్పించే దిశగా పలు పథకాల ద్వారా శాఖ ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎస్.సుధాకర్, డీఏఓ శ్రీధర్ స్వామి, డీఆర్‌డీఓ పీడీ రవీందర్ రాథోడ్, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ గంగా సింగ్ రాథోడ్, ఏపీఓ సురేందర్, టీపీ సాదిక్, ఉద్యాన, వ్యవసాయ అధికారులు, ప్రీ యూనిక్ కంపెనీ డీజీఎం మల్లేశ్వర రావు, సిబ్బంది బిందు సేద్య ప్రతినిధులు గ్రామస్థులు పాల్గొన్నారు.



తాడిహత్నూర్‌లో మొక్కలు నాటిన కలెక్టర్ రాజర్షి షా

● మట్టి సమునా విశ్లేషణ పత్రాల పంపిణీ

**నార్నూర్:** వ్యవసాయ శాఖ, ఇఫ్కో వారి ఆధ్వర్యంలో నానో యూరియా ప్లస్, నానో డీఏపీపై అవగాహన సదస్సు ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ వారు నార్నూర్ రైతు వేదిక వద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భూసార పరిరక్షణ పథకం ద్వారా భూసార పరీక్ష విశ్లేషణ పత్రం రైతులకు అందజేశారు. రైతులందరు మట్టి పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షల అనుసారం ఎరువులు వాడలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రతీ గ్రామంలో సోయిల్ హెల్త్ అవగాహన సదస్సు క్యాంపెయిన్ చేస్తామనివి వివరించారు.

**నార్నూర్:** మండలంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్వోదన్ ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. వివిధ వైద్య విభాగాల నిపుణులు ప్రజలకు అందించే ఉచిత వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. జనరల్ చెకప్, షుగర్, బీపీ, ఈసీజీ, మహిళల ఆరోగ్య పరీక్షలు, తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్, సాధన, డాక్టర్ ఉపాధ్యాయ, జనరల్ ఫీజిషియన్ విజయలక్ష్మి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న తుడుందెబ్బ సంఘం నాయకులు

### 'పేరుకే 30 పడకల ఆస్పత్రి.. సరైన వైద్యం లేదు'

**నార్నూర్:** మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నా.. సరైన వైద్యం రోగులకు అందడం లేదని కలెక్టర్ రాజర్షి షాకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. గర్భిణులకు స్కానింగ్ కోసం ఉట్నూర్ పంపుతున్నారన్నారు. రాకపోకల రోడ్డు మార్గం సరిగ్గా లేక నెలలు నిండక ముందే ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. పూర్తిగా వైద్యం అందేలా డాక్టర్‌లను నియమించాలన్నారు. ఉమ్మడి మండలం పాఠశాలలు మూతబడి ఉండడం వలన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెందుర్ దాదిరావు, మెస్రం మాణిక్ రావు, ఆడా శ్రీరాం, ఆత్రం పరమేశ్వర్, కినక నవీన్ పాల్గొన్నారు.

# కల్లుబట్టీపై ఎక్సైజ్ అధికారుల దాడులు

● ఖోడద్‌లో 80 లీటర్ల తెల్ల కల్లు పట్టివేత ● విక్రయదారుడిపై కేసు నమోదు ● కల్లు దుకాణానికి తాళం వేసిన అధికారులు

తలమడుగు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖోడద్ గ్రామంలో కల్తీ తెల్లకల్లు విక్రయిస్తున్నారని గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం మండలంలోని ఖోడద్ గ్రామంలో విక్రయిస్తున్న తెల్ల కల్లుబట్టిపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేసి 80 లీటర్ల తెల్ల కల్లును స్వాధీన పరుచుకొని ధ్వంసం చేశారు. అంతేకాకుండా శాంపిళ్ళ కోసం తీసుకెళ్లాడం జరిగిందని అధికారులు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో తెల్ల కల్లు విక్రయిస్తున్న సంఘశ్వర్, పరమేశ్వర్‌లపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ ఎస్సై విజయేందర్ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతి లేకుండా కల్తీకల్లు విక్రయిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా తెలకల్లు ఎవరైనా రసాయనాలు కలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తెల్ల కల్లు దుకాణాన్ని స్వాధీన పరుచుకొని తాళం వేశారు.



ఖోడద్‌లో తెల్ల కల్లు దుకాణానికి సీజ్ చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

## చట్టబద్ధత కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి : మాజీ మంత్రి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. బీసీ ప్రజా ప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ బీసీల మహాధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా విద్య, ఉద్యోగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో సైతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి ఎన్నికలు జరపాలని, 55 ఏళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న బీసీల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. 18 ఏళ్లు కేంద్రంలో ఉన్న బీజేపీ కూడా ఒక్క బీసీ మంత్రిని కేటాయించ లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు దాసరిరమేష్, గంద్రత్‌రమేష్, మారశెట్టిగోవర్ధన్, సతీష్‌పవర్, సేవ్వా జగదీశ్, భోజన్న, వేణుయాదవ్, రమణ, కేశవ్, తదితరులున్నారు.

## 'సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను పాఠశాలలోనే కొనసాగించాలి'

తలమడుగు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కజ్జర్ల ప్రాథమిక పాఠశాలలోని ముగ్గురు ఉపాధ్యాయులను సర్దుబాటు పేరు ఇతర పాఠశాలకు పంపించడంతో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదని మంగళవారం గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కజ్జర్ల ప్రాథమిక పాఠశాలలో దాదాపు వంద మంది విద్యార్థులు ఉన్నారని, ఆరుగురు ఉపాధ్యాయులు విద్య బోధనలు అందిస్తున్నారన్నారు. గత సంవత్సరం గురుకులాలకు దాదాపు 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అదేవిధంగా పాఠశాలలో ఏఐ విద్యాబోధన, ఇంగ్లీష్ మీడియం తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల నడుస్తుండడంతో ప్రైవేట్ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారని వివరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి, డీఈవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఇందులో గ్రామ పెద్దలు చింతలపల్లి దేవారెడ్డి, మొట్ట కిరణ్ కుమార్, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు కిష్టమ్మ, అగ్గిమల గణేష్, గంగన్న, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 'పరిష్కార మార్గం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది'

ఆదిలాబాద్ టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లావాసులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని బీసీ, ఎస్సీఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్రలో భాగంగా చేపట్టిన పర్యటనలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటికి పరిష్కారం చూపాలని అన్నారు. డిమాండ్ల సాధనే లక్ష్యంగా మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడారు. ఇందులో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమళ్ల గణేష్, నేతలు గణేష్, నరేష్, సుష్మ, శ్యామల, మంజుషా, సంతోష్, శ్రీకాంత్, తదితరులున్నారు.

## కార్మికుల వేతనం చెల్లించాలి: కిరణ్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రిమ్స్‌లో పని చేస్తున్న ఐహెచ్ఎఫ్ఎంఎస్ కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, జూన్ నెల వేతనంను వెంటనే కార్మికుల ఖాతాలో జమ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. మంగళవారం రిమ్స్ కార్మికులతో కలిసి తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ రిమ్స్ కమిటీ ఆధ్వర్యంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. ఇందులో రిమ్స్ కార్యదర్శి పెర్క దేవిదాస్, నాయకులు సురేందర్, పోచ్చన్న, ఖలీల్, రమేస్, రమాకాంత్, దశాంత్, వినీత్, ఇమ్రాన్, రాజు, తదితరులున్నారు.

## 'పీఆర్‌టీయూతో సమస్యల పరిష్కారం'

తలమడుగు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై వినోద్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పీఆర్‌టీయూ సంఘం పెద్దది అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో పోరాటాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ వై.వినోద్ రెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ స్వామి, రాష్ట్ర కార్యదర్శులు వెంకటరమణ, మురళీధర్ మండల అధ్యక్షులు నరసయ్య, జనరల్ సెక్రెటరీ సంతోష్, తదితరులున్నారు.

## 'వర్కర్ల వేతనాలు పెంచాలి'

ఉట్నూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు, పార్ట్‌టైం వర్కర్లకు వేతనాలు పెంచాలని తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ నాలుగవ తరగతి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఉన్న ఎంపీ నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రాలు అందించారు. ఇందులో జిల్లా గౌరవాధ్యక్షుడు కేబీసా నారాయణ, జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్, తదితరులున్నారు.

## 'కరెన్సీపై అంబేద్కర్ చిత్రం ముద్రించాలి'

ఇంద్రవెల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని, డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్టు కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరుశురామ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా పోస్టు కార్డు ఉద్యమాన్ని జూన్ 23 నుంచి ప్రారంభమైన చైతన్య యాత్ర మంగళవారం ఇంద్రవెల్లికి చేరుకుంది. ముందుగా దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

## లక్కారం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల తనిఖీ

ఉట్నూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాఠశాలలను మండల విద్యాధికారి ఆశన్న మంగళవారం తనిఖీలు నిర్వహించారు. లక్కారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎస్సీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,లక్కారం ఉర్దుమీడియం ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్ నోట్ పుస్తకాలు,యూనిఫార్మ్ అన్ని ఆన్‌లైన్‌లో ఎంట్రా చేయాలని దీనితో పాటుగా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలని,నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తీసుకు రావాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాథోడ్ సుభాష్, టీచర్లు ధృపద, షేర్‌సింగ్‌లున్నారు.



పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ఆశన్న

# దివ్యాంగులను ప్రోత్సహిద్దాం

● నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ చైన్‌గేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వైకల్యం ఉందని దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని, వారికి కొంత ప్రోత్సాహమిస్తే సకలాంగులతో సమానంగా ఏదైనా సాధించగలరని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి రాధిక పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో మంగళవారం దివ్యాంగ శక్తి ఫౌండేషన్ మూడో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, స్వయంగా దివ్యాంగుడైన పంచగుడి మహేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులను సాధించిన దివ్యాంగులకు ప్రశంసా పత్రాలు, సర్టిఫికెట్స్ ఫైల్స్ అందించారు. దివ్యాంగుల కోసం సేవలందించిన వారికి దివ్యాంగ మిత్ర విశిష్ట పురస్కారాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల్లోను అంతర్లీనంగా అద్భుత శక్తి ఉంటుందన్నారు. కాస్తంత ప్రోత్సహిస్తే వారు అన్నింట్లో రాణిస్తారని చెప్పారు. పారా ఒలింపిక్స్‌లో పాల్గొనే దివ్యాంగులను చూసి స్ఫూర్తి పొందాలన్నారు. స్వతహాగా దివ్యాంగుడైన పంచగుడి మహేష్ స్వయంగా ఉపాధి పొందుతూ తాను సంపాదించిన దాంట్లో నుంచి సమాజానికి ఖర్చు చేయడం చాలా గ్రేట్ అని అన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక హక్కులతో పాటు చట్టాలు ఉన్నాయని విశిష్ట అతిథిగా హాజరైన డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి రాధిక అన్నారు. దివ్యాంగులకు సత్వరమే న్యాయం అందించేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. ప్రముఖ కంటి వైద్యుడు కృష్ణంరాజు మాట్లాడుతూ... దివ్యాంగులపై జాలి, దయ మాత్రమే చూపకూడదని, వారికి అవకాశాలు అందిస్తే సకలాంగులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు సేవలందిస్తున్న వివిధ రంగాలకు చెందిన ముత్యం రెడ్డి (జిల్లా కార్మిక శాఖ అధికారి), మధుసూదన్ (డీడబ్ల్యూవో), డాక్టర్ స్వప్న (పిల్ల వైద్యులు), స్వర్ణలత (సామాజిక సేవకురాలు), రోహితధర్మ సేన (సామాజిక సేవకుడు), అవధూత్ నరేష్ (స్పెషల్ టీచర్), రాసం శ్రీధర్ (పాత్రికేయుడు)లకు 'దివ్యాంగమిత్ర విశిష్ట సేవా పురస్కారాల'ను అందించారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, పెన్షనర్ల సంఘం జాతీయ నాయకుడు ఎంసీ లింగన్న, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి దిగంబర్, పడిగెల లక్ష్మీనారాయణ, దశ గౌడ్, శ్రీనిధి ఫౌండేషన్, దివ్యాంగశక్తి ఫౌండేషన్‌ల ప్రతినిధులు పద్మావతి, రజిత, అనూష, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు సర్టిఫికెట్స్ ఫైళ్లను అందజేస్తున్న నిర్మల్ అదనపు కలెక్టర, డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక

# డెంగీ కేసుల నివారణపై ప్రత్యేక శ్రద్ధ

● ఆదిలాబాద్ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌ను డెంగీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తమ సహకారం అందించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్ అన్నారు. డెంగ్యూ కేసుల నివారణ కోసం కలెక్టర్ రాజార్షిషా ఆదేశాల మేరకు అర్బన్ యాక్షన్ ప్లాన్‌ను చేపట్టారు. మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా మూడు శాఖలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కాగా మంగళవారం యాక్షన్ ప్లాన్‌ను ప్రారంభించి శ్రీరాంనగర్ కాలనీలో డ్రైడే నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతు నిల్వనీటిని పారబోయించారు. పరిసరాల పరిశుభ్రత, దోమలు ఏ విధంగా వృద్ధి చెందుతాయో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ జిల్లాలో డెంగీ కేసులను పూర్తిగా నివారించడానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 22 కేసులు నమోదైతే ఇందులో 13 ఆదిలాబాద్ పట్టణానికే సంబంధించినవి ఉన్నాయన్నారు. డెంగీని పూర్తిగా నివారించడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు అర్బన్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి మున్సిపల్, వైద్య ఆరోగ్య, మెప్మా సిబ్బందితో పట్టణంలోని 49 వార్డులకు గాను 6టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటింటికీ వెళ్లి దోమల వల్ల వృద్ధి చెందే వ్యాధులను వివరిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నామన్నారు.ప్రజలు కూడా వర్షపు నీటితో పాటు ఖాళీ కుండిలు, టైర్లు, కొబ్బరి బొండల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, శాంతినగర్ అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఇఫ్రాత్, మలేరియా సూపర్‌వైజర్ అనిల్, అర్బన్ సూపర్‌వైజర్ కేమ రాజారెడ్డి, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



నిల్వ నీటిని పారబోయిస్తున్న మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

బజార్‌హత్నూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా ఎంపీ గోడం నగేష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఓఎన్‌జీసీ ద్వారా మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళలకు ఓఎన్ జీసీ సంస్థ సభ్యులు మృత్యుంజయతో కలిసి 270 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ల పై నిలబడి ఆర్థిక స్వావలంబనతో తోడ్పాటు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మహిళలు కుటుంబ పోషణలో పాటు పంచుకుంటు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ముున్ముందు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ఉండబోతున్నాయని పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధితో కుటుంబ పోషణలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 45 ట్యాబ్‌లను అందజేశారు. పోటీ ప్రపంచంలో డిజిటల్ చదువులతో దూసుకెళ్లాలన్నారు. అనంతరం డెడ్రా, గిరిజాయి గ్రామాల్లో పర్యటించి గ్రామీణుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపెల్లిరాజు, పార్టీ మండల అధ్యక్షులు పోరెడ్డిశ్రీనివాస్, నాయకులు నాణం రమణ, గణేష్, శంకర్, వామన్‌గిత్తే, మురళి తదితరులు పాల్గొన్నారు.

## సోన్ పాఠశాలను సందర్శించిన డీఈవో

సోన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోన్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి రామారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో అన్ని సౌకర్యాలు మెరుగుపరిచి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా పాఠశాల నమోదు వివరాలు తెలుసుకొని విద్యార్థుల నమోదు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం వండే పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, వర్షాకాలం కాబట్టి మధ్యాహ్న భోజనం తయారీలో సరైన శ్రద్ధ వహించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలోని విద్యార్థులకు నిర్వహించాల్సిన కార్యక్రమాలు సజావుగా నిర్వహించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపరిచేందుకు తగిన కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త నర్సయ్య, లింబాద్రి, మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

నేరడిగొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఎంఎల్‌హెచ్‌పీ భీంరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని ఆరెపల్లిలో డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. అనంతరం గ్రామస్థులకు జ్వరాలపై పరీక్షలు చేసి సంబంధిత మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐఓ పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, అంగన్‌వాడీ రాథోడ్ అశ్విని, ఆశా సంగీత బాయి, మాజీ సర్పంచ్ గంగప్రసాద్, తదితరులున్నారు.

## భూహద్దులను గుర్తించేందుకు సర్వే

కడెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ శివారులో భూ హద్దులను గుర్తించేందుకే రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టినట్లు ఆర్డీవో రత్న కళ్యాణి తెలిపారు. కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ శివారులో జరుగుతున్న రెవెన్యూ భూ సర్వే ప్రదేశాన్ని నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. 2015లో అటవీ శాఖ భూములను పునరావాస గ్రామాల ప్రజల ప్రయోజనాల కోసం డీనోటిఫై చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. రాంపూర్, మైసంపూట్ పునరావాస గ్రామాల ప్రజలకు చట్ట ప్రకారం భూములు పంచేందుకు అర్హులను గుర్తించామన్నారు. ఇందులో కడెం, ఖానాపూర్ తహసీల్దార్, ఆర్ఐ, తదితరులు పాల్గొన్నారు.

## 'ఆలయాభివృద్ధికి సహకరించండి'

దిలావర్‌పూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాల్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి నిధులు మంజూరు చేసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని దేవస్థానం పాలక మండలి మంగళవారం వరంగల్‌లోని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అంగూర్ మహేందర్ ఆలయంలో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. గోశాల నిర్మాణంతో పాటు ఆలయానికి వాచ్‌మెన్‌ను నియమించాలని కోరారు. డీసీవో సానుకూలంగా స్పందించినట్లు చైర్మన్ మహేందర్ తెలిపారు. ఆలయ ఈవో భూమయ్య, పాలక మండలి సభ్యులు గైని దేవేందర్, జి. నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు

నిర్మల్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శనగర్ వశిష్ఠ హైస్కూల్‌లో మంగళవారం పర్యావరణ రక్షణ కొరకు మొక్కల పెంపకం ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థిని విద్యార్థులు మొక్కలు నాటినట్లు పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ... పర్యావరణంలో మొక్కల ప్రాముఖ్యతను, మానవ జీవనంలో మొక్కల ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీవో 49ని వెంటనే రద్దు చేయాలి

బోథ్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 49ని రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సోనాల మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసుల భూములపై హక్కులు కోల్పోతారని వారు పేర్కొన్నారు. దాదాపు 550 మంది ఆదివాసీ కుటుంబాలను ప్రభుత్వం అడవుల నుంచి వెళ్లగొట్టేందుకు జీవో జారీ చేసిందన్నారు. ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని లేకుంటే ఉద్యమం తప్పదని ఆదివాసీ సంఘం వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# అర్లి(కె) సమీపంలో ఆటో బోల్తా

● వ్యవసాయ కూలీలు సహా నలుగురికి తీవ్ర గాయాలు

నర్సాపూర్(జి), జూలై 15(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలం అర్లి(కె) గ్రామంలో మంగళవారం సాయంత్రం 6:20 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో సహా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక మహిళ చెయ్యి విరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అర్లి(కె) గ్రామానికి చెందిన మగ్గిడి కైలాస్ తన చేనులో కలుపు తీసే పనుల కోసం బూరుగుపల్లి(కె) గ్రామం నుంచి కూలీలను ఉదయం ఆటోలో తీసుకువచ్చారు. పనులు ముగిసిన అనంతరం కూలీలను తిరిగి బూరుగుపల్లి(కె) గ్రామానికి తీసుకెళ్తుండగా అర్లి(కె) పొలిమేరలో సెగ్రిగేషన్ షెడ్ సమీపంలో లోకేశ్వరం వైపు నుండి బూ రుగుపల్లి(కె) వెళ్తున్న ఆటో చిన్న కల్వర్టు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కైలాస్‌కు తల భాగంలో తీవ్ర రక్తస్రావం కాగా, అర్లి(కె) గ్రామానికి చెందిన సుధాకర్ శరీర భాగం రోడ్డుపై రెండు మీటర్ల మేర రాసుకుపోయి తీవ్ర గాయాలయ్యాయి. బూరుగుపల్లి(కె) గ్రామానికి చెందిన మహిళా కూలీలు ఉజ్వల, లక్ష్మీ చేతులు నలిగిపోయి అధిక రక్తస్రావం జరిగింది. మరో కూలీ సావిత్రిబాయికి చెయ్యి విరిగినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులకు సహాయం అందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. లోకేశ్వరం, నర్సాపూర్(జి), కుంటాల మండలాల నుంచి మూడు 108 వాహనాలు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను వెంటనే 108 వాహనాల్లో సమీపంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందుతోంది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఒకేసారి మూడు 108 వాహనాలు చేరుకున్న దృశ్యం

## సర్పంచులకు అవినీతి మరకలు

(5వ పేజీ తరువాయి...)

తిరిగి రాబట్టుకోవడం కొంత మంది గ్రామస్థాయి నేతలకు అలవాటుగా మారిందంటున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకొని లక్షల రూపాయలను వెనుకేసుకుంటున్నారు. అధికారుల అండదండలతో నకిలీ బిల్లులను సృష్టించి అందినకాడికి దండుకుంటున్నారు. ఆడిట్ అధికారులు కూడా తేలికగానే తీసుకోవడంతో సర్పంచ్‌ల అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. అలాగే స్థిరాస్తి వ్యాపారంలోనూ రాణిస్తూ బోలెడన్ని ఆస్తులను కూడబెట్టుకుంటున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న గ్రామ పంచాయతీలతో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లో భారీ అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏజెన్సీ గ్రామ పంచాయతీల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా అనుమతులనిస్తూ లక్షల రూపాయలను జేబులో వేసుకుంటున్నారు. అక్రమ సంపాదనపై ఉన్న ఆసక్తి గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమంపై లేదన్న విమర్శలు వస్తున్నాయి.

### ఫిర్యాదు వస్తేనే హడావిడి

గతంలో పలు గ్రామ పంచాయతీల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు హడావిడి చేశారు. అప్పట్లో త్రిసభ్య కమిటీని వేసి విచారణ కూడా జరిపించారు. ఆ తర్వాత విచారణ నివేదిక ఉన్నతాధికారులకు అందిన చర్యలు తీసుకోకుండా పక్కన పడేయడంపై పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఇప్పటి వరకు దుర్వినియోగమైన నిధుల్లో నయా పైసా రికవరీ చేయక పోవడంతో అవినీతికి పాల్పడిన సర్పంచ్‌లు గ్రామాల్లో యథేచ్ఛగా చెలామణి అవుతున్నారు. రాజుల పైసా రాళ్లపాలు అన్నట్లుగా అధికారులు వ్యవహరించడంతో ప్రజాధనం వృధాగానే మారింది. ఒక్కసారి అవినీతి ఆరోపణలు రుజువైతే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా కట్టడి చేస్తే కొంత వరకైనా అవినీతికి అడ్డుకట్ట పడే అవకాశం ఉందంటున్నారు. అలాగే రెవెన్యూ చట్టాలను పకడ్బందీగా అమలు చేసి రికవరీకి అవకాశం ఉన్న అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదో అంతుచిక్కడం లేదంటున్నారు. అధికారుల సొంత డబ్బులైతే ఇలా నిర్లక్ష్యంగానే వదిలేస్తారా? అనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

## శాంతిభద్రతల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం : ఏఎస్పీ

భైంసా రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాగాం గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించామని ఏఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలో సరైన ధ్రువపత్రాలు లేని 104 టూ వీలర్లు, 7 ఆటోలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు వచ్చినచో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అదేవిధంగా గంజాయి మత్తుకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను నిర్వహించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా గంజాయి అమ్మడం గాని సేవించడం గాని తెలిస్తే 100కు డయల్ చేసి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ రూరల్ సీఐ నైలు, ఎస్సై శంకర్, ఎస్సై సుప్రియ, పోలీస్ బృందం, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పద్మశాలి సంఘ నేత ఆడెపు భూమన్న కన్నుమూత



నిర్మల్ టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా పద్మశాలి సంఘం సమన్వయకర్త, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీ కో కన్వీనర్ ఆడెపు భూమన్న సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. నిర్మల్ బస్టాండ్ సమీపంలో కాలినడకతో రోడ్డు డివైడర్‌ను దాటే క్రమంలో ఆయనను ఎదురుగా వచ్చిన బైక్ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో భూమన్న అక్కడే కింద పడిపోగా ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే ఆయన మృతి చెందాడు. మంగళవారం నిర్మల్ లో నిర్వహించిన ఆడెపు భూమన్న అంత్యక్రియల్లో జిల్లా పద్మశాలి సంఘాల సభ్యులు, బీడీ కార్మికులు, ఏజెంట్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఆడెపు భూమన్న మృతి పట్ల పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్దా రమణ, జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ, ప్రధాన కార్యదర్శులు అల్లం అశోక్, అందే గం గాధర్, సంఘం కార్యనిర్వాహక సభ్యుడు కుర్ర నరేష్, పోపా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్కం మురళీ, బొద్దుల రమణ, తదితరులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## సుంకిడిలో యువతి ఆత్మహత్య

తలమడుగు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన గంగాధర నందిని(19) అనే యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన గంగాధర సత్యనారాయణ కూతురు గత మూడు సంవత్సరాల నుంచి మానసికస్థితి ఆరోగ్యం బాగాలేక ఇబ్బందులు పడుతుందన్నారు. ఉదయం పూట స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌కి వెళ్లి ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు గమనించి బాత్రూం వైపు వెళ్ళగా బాత్రూంలో చున్నితో ఉరేసుకొని కనబడడంతో వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని కుటుంబీకులు తెలిపారు. కాగా మృతురాలు డిగ్రీ రెండో సంవత్సరం ఆదిలాబాదులో చదువుతుందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఇచ్చోడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): కిరాణా దుకాణానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇచ్చోడ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో నుంచి బయటకి వెళ్లిన వ్యక్తి ఎంతకి తిరిగి రాకపోయోసరికి కుటుంబ సభ్యులు సోమవారం బార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇచ్చోడ మండల కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ గురుకుల పాఠశాల ప్రహరీ గోడ పక్కన గుర్తుతెలియన వ్యక్తి చనిపోయి ఉన్నారని సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా జాదవ్ దేవిదాస్(42) పురుగుల మందుతాగి చనిపోయినట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియవని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.

## సెల్‌ఫోన్ పేలి యువకుడికి తీవ్ర గాయాలు

భీంపూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి సెల్‌ఫోన్ పేలి తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన కొండ గంగాధర్ అనే యువకుడు సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ నుంచి పిప్పల్‌కోటి వస్తున్న క్రమంలో ప్యాంట్ జేబులో ఒక్కసారిగా ఫోన్ పేలింది. తొడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కాగా, గంగాధర్ ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు.

## ఆష్టా లిఫ్ట్ ఇరిగేషన్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ముథోల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆష్టా శ్రీజ్ఞాన సరస్వతీ లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ ఎత్తుకెళ్లారు. స్థానికులు, రైతుల కథనం ప్రకారం... లిఫ్ట్ పంప్ హౌస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కింద పడడాన్ని రైతులు గమనించి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అయితే గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో ఉన్న రూ.16 లక్షల విలువ గల కాపర్‌ను దొంగిలించారని గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు సుమారు మూడు నాలుగు రోజుల క్రితమే కాపర్‌ను దొంగిలించి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ విషయమై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

భైంసా రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): భైంసా పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేసి, ఈ విషయంపై ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడారు. పట్టణానికి చెందిన షేక్ అహ్మద్, సుల్తాన్ అనే ఇద్దరు దుండగులు గాంధీ గంజ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారని పక్కా సమాచారం మేరకు సీఐ గోపీనాథ్, ఎస్సై నవనీత్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి దాదాపు రెండు కేజీల గంజాయిని, విక్రయదారులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఈ వ్యక్తులపై గతంలో సైతం కేసులు ఉన్నాయంటూ అన్నారు. ప్రస్తుతం ఇద్దరి గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.



రోడ్డును అనుకుని స్తంభాలు వేసిన దృశ్యం (ఫైల్)

## ఆ సమస్యకు పరిష్కారం ఏది?

**రాకపోకలకు ఇబ్బందులు**

తాంసి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అనుకొని స్తంభాలు వేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహన చోదకులు అంటున్నారు. ఇటీవల కప్పర్ల నుంచి జామిడి ఎక్స్ రోడ్ వరకు కొత్త స్తంభాలను వేశారు. అయితే ఈ స్తంభాలు రోడ్డుకు దగ్గరగానే ఉండడం రెండు వాహనాలు ఎదురు ఎదురుగా వస్తే వెళ్లలేని స్థితిలో ఉన్నాయి. ఈ విషయంపై ఇప్పటి వరకు ఏ ఒక్కరు స్పందించకపోవడంతో రోడ్డుపైనే స్తంభాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. వాస్తవానికి రోడ్డుకు కొంత దూరంలో స్తంభాలు వేయాల్సి ఉంటుంది. కానీ ప్రణాళికలు లేని పనులతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాహన చోదకులు అంటున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఇది ఒక జామిడీ కప్పర్ల మధ్య సమస్యనే కాదని చాలా చోట్ల ఇలాగే స్తంభాలు రోడ్డుకు అనుకొని ఉన్నాయంటున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

# విధులకు అతిథులు.. కాలానికి అతీతులు

● ఆవరణలో తిరుగుతున్న విద్యార్థులు



ఆశ్రమ పాఠశాలలో ప్రేయర్‌కు హాజరుకాని మొత్తం సిబ్బంది



ఉన్నత పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న సగం సిబ్బంది

కుభీర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలలు బలోపేతం కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. నెలకు రూ. లక్షల్లో వేతనాలు పొందుతున్న ఉపాధ్యాయులు, సంక్షేమ వసతిగృహాల్లోని నిర్వాహకులు కాంట్రాక్ట్ రెసిడెన్సియల్ టీచర్లు(సీఆర్‌టీ) సమయ పాలన పాటించడం లేదు. దీంతో మంగళవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలో రోడ్డు వెంబడి తిరుగుతూ కనిపించారు. ఈ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 70 మంది విద్యార్థులు, 5 ఉపాధ్యాయులు ఉన్నారు. సమయం 9.30 గంటలు దాటిన ఏ ఒక్క ఉపాధ్యాయుడు హాజరు కాలేదు. కేజీబీవీ మొత్తం దాదాపు 315 మంది విద్యార్థులకు గాను నిర్వాహకురాలితో పాటు 9 మంది సీఆర్‌టీలు ఉండగా ప్రార్థన సమయంలో కేవలం ముగ్గురు సీఆర్‌టీలు మాత్రమే ఉన్నారు. ఆశ్రమ బాలికల పాఠశాలలో 190 మంది విద్యార్థులకు గాను నిర్వాహకురాలు, 4గురు సీఆర్‌టీలు, ఉండగా ప్రార్థనకు వార్డెన్ ఒక సీఆర్‌టీ మాత్రమే ఉన్నారు. ప్రాథమిక కొన్నత పాఠశాలలో 422 మంది విద్యార్థులు 23 మంది ఉపాధ్యాయులకు గాను ప్రేయర్ సమయానికి పది మంది ఉపాధ్యాయులు మాత్రమే హాజరయ్యారు. సమయ పాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుని సంస్థమ వసతి గృహాల నిర్వాహకులు స్థానికంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతయిన ఉంది.





## నిలకడ లేని నిఘా నేత్రం

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జన సంచారం ఉన్న ప్రదేశాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక రైతు బజార్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల స్తంభాలు వంకరగా మారడం, కెమెరాలకు సరైన దిశ లేకపోవడం, ఒకటి ఆకాశం వైపు, మరొకటి భూమి వైపు అమర్చడం వంటి లోపాలను సరిచేయాలని వినియోగదారులు, స్థానిక వ్యాపారస్తులు కోరుతున్నారు. కెమెరాల కిందనే కూరగాయల వ్యర్థాలు కంపు కొడుతున్నా పట్టించుకునే నాథుడు లేక పోవడం గమనార్హం. ● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)





# రోడ్లన్నీ బురదమయం

**ప్రమాదకరంగా ప్రయాణం**

**మరమ్మతులు కరువు ▸ ప్రయాణం బరువు**

ఉట్నూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వానా కాలం వచ్చిందంటే రోడ్లన్నీ బురదమయం కావడంతో ప్రజలకు ప్రయాణం ప్రమాదకరంగా తయారవుతుంది. ఉట్నూర్ మండలంలోని గిరిజన గ్రామాలకు వెళ్లే దారులన్నీ అధ్వానంగా మారి ప్రజలకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్ల పై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. కొన్ని రోడ్లు మాత్రం బా టసారులు సైతం నడవడానికి వీలు లేకుండా బురదతో నిండి పోవడంతో గిరిజనులు కాలినడకన తిరుగుతున్నారు. ఉట్నూర్ మండలంలోని దంతనపల్లి నుంచి తాటిగూడ మీదుగా చెరువుగూడ, జెండాగూడ, మొర్రిపేట్ తదితర గ్రామాల గిరిజనులు బురద రోడ్డు గుండా భయం భయంగా నడిచి వెళ్తున్నారు. నర్సాపూర్(జె); కుమ్మరికుంట, దొంగ చింత గ్రామాల దారుల సైతం బురదమయంగా మారాయి. షాంపూర్ సమీపం నుంచి సుంగగూడ, తాండ్ర రాజన్నగూడెంకు వెళ్లే దారిపై గుంలు ఏర్పడి వర్షపు నీరు రోడ్ల పై నిలబడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతు ప్రయాణిస్తున్నారు. ఎండా క్రాస్‌రోడ్డు నుంచి ఏండా, ఉమ్రి, వడోని, నర్సాపూర్(బి), రాముగూడ గ్రామాలకు వెళ్లే రోడ్డు పై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలబడుతుంది. షాంపూర్ నుంచి లక్షేటిపేట, కామాయిపేట్ తదితర గిరిజన గ్రామాలకు వెళ్లే దారిలో వాగు సమీపంలో వంతెన అప్రోచ్‌రోడ్డు గత వర్షాకాలంలోనే కొట్టుకు పోగా తాత్కాలిక మరమ్మతులు చేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బురదమయం అయింది.



గుంతలతో నిండిన ఎండా, ఉమ్రి దారి



బురదమయంగా మారిన చెరువుగూడ రోడ్డు



తాండ్ర రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

**మరమ్మతులు కరువు.. ప్రయాణం బరువు**

ప్రతినిత్యం ఈ రోడ్లపైన వివిధ పనుల కోసం ద్విచక్ర వాహనాలతో, ఆటోలలో, జీపులలో ప్రయాణిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఏళ్లు గడుస్తున్న అధికారులు కాని, ప్రజా ప్రతినిధులు కాని రోడ్ల మరమ్మత్తుల కోసం పట్టించుకోక పోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని పరిశీలకులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గిరిజన ప్రాంతాలలోని రోడ్లకు మరమ్మతులు చేయించి ప్రజలకు ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు.

## అమలుకాని మెనూ..



కిచిడీని చూపిస్తున్న బాలికలు

కుభీర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) కుభీర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఉదయం భోజనంలో మెనూ అమలు చేయలేదు. ఇడ్లి సాంబార్, పాలు, బూస్ట్ అందించాల్సి ఉండగా రుచిపచి లేని కిచిడితో సరిపెట్టారు. దీంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించారు. ఇదేమిటని నిర్వాహకురాలితో ప్రశ్నించగా సిబ్బంది గైర్హాజరు కారణంగా విద్యార్థులకు ఇడ్లి సాంబర్ అందించలేక పోయామన్నారు.

## ప్లాస్టిక్ కవర్లను వాడొద్దు

**వ్యాపారుల అవగాహన సదస్సులో మునిసిపల్ కమిషనర్ సుందర్‌సింగ్**



సదస్సులో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ సుందర్ సింగ్

ఖానాపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ కాలుష్యానికి మూల కారణమవుతున్న ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని ఖానాపూర్ మునిసిపల్ కమిషనర్ సుందర్ సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వాసవి మాత ఆలయ ప్రాంగణంలో పట్టణంలోని వ్యాపారస్తులకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్లాస్టిక్ వస్తువులను, కవర్లను ఉపయోగిస్తే రాబోయే రోజుల్లో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు కావలి సంతోష్, బుచ్చన్న, జితేందర్, యాదగిరి, మున్సిపాలిటీ అధికారులు, తదితరులున్నారు.

# రాయితీ దూరం.. గ్యాస్ భారం

● **మహాలక్ష్మీ పథకంలో జమకాని నగదు**

కుభీర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వంటగ్యాస్ వినియోగదారులకు నెలలుగా రాయితీ డబ్బులు జమ కావడం లేదు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి మహాలక్ష్మీ పథకం కింద వంటగ్యాస్‌ను రూ. 500లకే సరఫరా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాగా రాయితీ డబ్బులు జమ చేయడం లేదు. దీంతో అర్హులైన గృహ వినియోగదారులు వంట గ్యాస్ కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. మండలంలో 1480 మంది దీపం పథకం, 2506 ఉజ్వల, సెంట్రల్ స్కీం 1656, జనరల్ 2880 వాణిజ్య తదితర కనెక్షన్లు మండల కేంద్రంలోని ఇండెన్ గ్యాస్ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 8714 వినియోగదారులున్నారు.

● **పేదలపై ఆర్థిక భారం...**

వంటగ్యాస్ వినియోగించే పేదలు పూర్తిస్థాయి ధర చెల్లించడంతో ఆర్థిక భారం పడుతోంది. తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే రాయితీలో నగం డబ్బులతోనే వంట గ్యాస్ ఇంటికి చేరే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఉజ్వల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన ఉజ్వల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన దీపం పథకం క్రింద వంట గ్యాస్ పొందిన లబ్ధిదారులపై కూడా ఆర్థిక భారం పడుతోంది. పేదల కోసం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకం కింద అర్హులైన వంట గ్యాస్ వినియోగదారులకు రాయితీ డబ్బులు జమ కావాల్సి ఉండగా వాటిని నిలిపి వేయడంతో ఆందోళన చెందుతున్నారు.



గ్యాస్ సిలెండర్లు



గుంపులుగా ఉన్న కుక్కలు

## విజృంభిస్తున్న పిచ్చి కుక్కలు

● **మూడు రోజుల వ్యవధిలో 12 మందికి గాయాలు**

తాంసి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో పిచ్చి కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఎప్పుడు ఎవరిని కాటు వేస్తున్నా యో తెలియని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన తాంసితో పాటు మండలంలో ఉన్న 12 గ్రామ పంచాయతీల్లో కూడా ఈ పరిస్థితి తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. పట్టించుకునే వారే లేక వాటిని అదుపు చేయలేక చేతులెత్తేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కుక్కలు పిచ్చికుక్కలుగా మారి ఎవరిని కరుస్తున్నాయో తెలియడం లేదు. దీంతో చిన్నారులు పాఠశాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. పెద్దవారు కూడా బయటకు వెళ్లాలంటే భయందోళనకు గురవుతున్నారు. మోటార్ సైకిల్‌పై వెళుతున్న వెంబడిస్తున్నాయి. అంటే అందులో ఎలాంటి సందేహం లేదు. కుక్కల బారినపడిన పలువురు అవిటివారీగా మిగిలారు. మూడు రోజుల నుంచి కుక్కల స్వైర విహారం రోజురోజుకు పెరుగుతుంది. దీంతో మూడు రోజుల వ్యవధిలోనే 12 మందికి కుక్కలు గాయాలపాలు చేశాయి. 16 మేక పిల్లలను చంపుకు తిన్నాయి. ఒక లేగ దూడపై దాడి వేశాయి. దీంతో మండల వాసులు భయందోళనకు గురవుతున్నారు. వందలాది కుక్కలు తమ గ్రామంలో సంచరిస్తున్నాయని కానీ ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వెలుబుచ్చారు. చిన్న పిల్లలను బయటకు పంపాలంటే భయమేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించి కుక్కలను నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గాయాలపాలైన శివయ్య



ఓటు వేయడానికి వరుసలో ఉన్న విద్యార్థినులు

# ఓటెత్తారు!

నిర్మల్ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థి పాలకవర్గ ఎన్నికలు నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సామ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సోషల్ మీడియాని వినియోగించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అదేవిధంగా తమ వ్యక్తిగత సమాచారం, ఫొటోలు బహిర్గతం చేయకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ అయ్యన్నగారి భూమయ్య, ట్రెజరర్ ఆడెపు సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నీరం విజయలక్ష్మి, కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





టౌన్ సీఐని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం



# నిర్మల్ జిల్లాలో ఆధార్ సేవల విస్తరణ

**'ఇన్-హౌస్ మోడల్'తో ప్రజలకు మరింత చేరువ**

**ఆపరేటర్లకు ఆర్థిక భారం**

నిర్మల్ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆధార్ నమోదు, నవీకరణ సేవలను మెరుగుపరచడానికి తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ 'ఇన్-హౌస్ మోడల్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు జిల్లా మేనేజర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈఎస్‌డీ-మీసేవ ద్వారా అధికృత సర్వీస్ ప్రొవైడర్‌గా నియమితులైనందున జిల్లా కేంద్రంలో శాశ్వత ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనితో ఆధార్ సేవలను మరింత సులభతరం చేస్తుందని, దూర ప్రయాణాల అవసరాన్ని తగ్గిస్తుందని తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆపరేటర్ల నుండి రూ.1,50,000ల డీడీ సంబంధిత డాక్యుమెంట్లను సేకరించినట్లు తెలిపారు.

**కొత్త మండలాల ఆపరేటర్లు**

**డీడీ చెల్లింపుల నుంచి మినహాయింపులు ఇవ్వాలి..**

కొత్తగా ఏర్పడిన మండలాలైన పెంబి, కడెం, దస్తురాబాద్, నర్సాపూర్(జి), సోన్ గ్రామంలోని ఆధార్ ఆపరేటర్లకు ఆర్థిక భారాన్ని మోపుతోందని తెలిపారు. వారు ఇప్పటికే ల్యాప్‌టాప్ రూ. 1,50,000 డీడీ చెల్లించాల్సి వస్తోందన్నారు. గతంలో వారికి స్టేషన్ ఐడీలు వచ్చి, కొన్ని చోట్ల సేవలు ప్రారంభం కాకపోవడంతో కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా మారాయని ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నిర్మల్‌లో ఆపరేటర్ల నుంచి డీడీలు పత్రాలు సేకరిస్తున్న దృశ్యం

**సీఎస్‌సీ తో ఒప్పందం రద్దు చేయండి..**

**- టీజీఎంఎఫ్ రాష్ట్ర మీడియా బాధ్యులు**

సీఎస్‌సీతో ఒప్పందం రద్దు చేయాలని లేకుంటే త్వరలో సమ్మె చేస్తామని టీజీఎంఎఫ్ రాష్ట్ర మీడియా బాధ్యులు కామోజీ వేణుగోపాల్ అన్నారుఈ. సందర్భంగా మాట్లాడుతూ... మీ సేవ కేంద్రంలో అందే సేవలను ఈ గవర్నెన్స్ సర్వీసెస్‌కు అప్పగించడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ అధికారులు సీఎస్‌సీ సంస్థతో కుదుర్చుకున్న అప్రయోజక ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మెరుగు పవన్, తదితరులు పాల్గొన్నారు.

# ఎదురుచూపులకు తెర

**• రేషన్ కార్డుల సంబురం • జిల్లాలో 32వేలకు పైగా కొత్త కార్డుల కోసం దరఖాస్తులు • కొత్త కుటుంబ సభ్యుల చేరికకు మరో 42వేల మంది • ప్రజాపాలన, గ్రామసభల దరఖాస్తులకు ప్రాధాన్యం • కొత్త కార్డులకు ఆగస్టు తరువాత రేషన్ పంపిణీ**

నిర్మల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల నుంచి కొత్తరేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల సమస్యకు ఎట్టకేలకు తెరపడబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేందుకు ఇప్పటికే పెద్దసంఖ్యలో దరఖాస్తులను సైతం స్వీకరించింది. ఈ కొత్త రేషన్ కార్డులతోపాటు కుటుంబంలో అదనపు సభ్యుల చేరికకు సంబంధించిన దరఖాస్తులను కూడా ఈ సందర్భంగా స్వీకరించారు. ఈ రెండింటికి తోడుగా ప్రజా పాలన, గ్రామసభల్లో కూడా నిరంతరం రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులను ప్రజలు అందించారు. అధికారులు వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. గత ఏడాది కాలం నుంచి కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం సీరియస్‌గా కసరత్తు జరుపుతోంది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హమీ మేరకు ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల పంపిణీపై సీరియస్‌గా దృష్టి సారించడమే కాకుండా ప్రతిపక్షాల విమర్శలను సైతం తిప్పికొడుతూ వస్తోంది. ఎట్టకేలకు రేషన్ కార్డుల పంపిణీకి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కొద్ది రోజుల క్రితమే జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులన్నింటిని కంప్యూటరీకరించి జాబితాను రూపొందించారు. ఈ జాబితాకు అనుగుణంగా కొత్త కార్డులు, సవరణల జాబితాల ఆధారంతో కార్డులను రూపొందించారు. ప్రస్తుతం అన్ని జిల్లాలకు కొత్త కార్డులకు ఎంపికైన వారి జాబితాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. కొద్ది రోజుల్లోనే పంపిణీ ప్రక్రియను జాబితా ఆధారంగా చేపట్టబోతున్నారు. అయితే కొత్తగా ఎంపికైన కార్డుదారులకు సెప్టెంబర్ నెల నుంచి కొత్త రేషన్ కోటాను అందించనున్నారు.


లబ్దిదారులకు రేషన్ సరుకులు ఇస్తున్న దృశ్యం

### రేషన్ కార్డులకు భారీగా దరఖాస్తులు

కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి. అధికారులు మొత్తం 32,473 దరఖాస్తులను అర్హులైన వారి నుంచి స్వీకరించారు. అయితే ఈ దరఖాస్తులపై విచారణ జరిపిన అధికారులు ఇందులో నుంచి 26,006 దరఖాస్తులను మాత్రమే రేషన్ కార్డుల జారీకి అర్హత ఉన్నట్లుగా నిర్ధారించారు. స్థానికంగా 3045 దరఖాస్తులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. సంబంధిత మండల తహసీల్దార్‌ల వద్ద 932 దరఖాస్తులు, డీఎస్‌ఓ వద్ద 1663 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో మొత్తం 5640 దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అయితే కొత్త రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు సీరియస్‌గా పరిశీలించి అందులో నుంచి 837 దరఖాస్తులు అర్హత లేనివిగా తేల్చారు. దీని ప్రకారం జిల్లాకు 26,006 కొత్త రేషన్ కార్డులు కేటాయించనున్నారు.

### కొత్త సభ్యుల చేరికకు భారీ సంఖ్యలో..

ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో అదనంగా తమ కుటుంబ సభ్యుల పేర్లను చేర్చేందుకు కూడా భారీ సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. రేషన్ కార్డుల కన్నా ఎక్కువ సంఖ్యలో అదనపు సభ్యుల కోసం వచ్చిన దరఖాస్తుల సంఖ్యనే ఎక్కువగా ఉండడం గమనార్హం. మొత్తం 47,239 దరఖాస్తులు రాగా ఇందులో నుంచి 42,552 దరఖాస్తులను అధికారులు అప్రూవ్ చేశారు. కాగా మొత్తం 2189 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. ఇందులో నుంచి డీఎస్‌ఓ వద్ద 1378, తహసీల్దార్‌ల వద్ద 401, ఆర్‌ఐల వద్ద 410 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా మొత్తం 47,239 దరఖాస్తులకు గానూ 2498 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అర్హత సాధించిన దరఖాస్తులకు సంబంధించి ప్రస్తుతం ఉన్న కార్డుల్లో మార్పులు చేర్పులు చేస్తూ కొత్త కార్డులను అందించనున్నారు.

### రేషన్ కోసం ఇక ఎదురుచూపులు

వరదల కారణంగా ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమై రేషన్ సరుకుల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే అర్హులైన లబ్దిదారులందరికి ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేసింది. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి రేషన్ బియ్యాన్ని ఇప్పటికే పాత లబ్దిదారులందరికీ పంపిణీ చేసింది. అయితే కొద్దిరోజుల్లోనే కొత్త రేషన్ కార్డులు, కొత్త సభ్యుల నమోదుతో కూడిన కార్డులకు రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే ఆగస్టు కోటా పంపిణీ ముగిసిపోవడంతో కొత్త లబ్దిదారులందరికి సెప్టెంబర్ నెలలో రేషన్ బియ్యం అందే అవకాశం ఉందని భావిస్తున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## డీ1 పట్టాలపై క్షేత్రస్థాయిలో సర్వే

**• కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్‌టౌన్,జూలై15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో డీ1 పట్టాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డీ1 పట్టాల జారీపై మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డీ1 పట్టాలపై క్షేత్రస్థాయిలో సర్వేచేపట్టి అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. భూ హక్కులపై స్పష్టత కలిగేలా దరఖాస్తుల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను భూభారతి పోర్టల్‌లో వెంటనే అప్డేట్ చేయాలని, వీలైనంత ఎక్కువ అప్లికేషన్లను త్వరితగతిన డిస్పోజ్ చేయాలని తహసీల్దార్లకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్, సర్వే శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడాన్ని బాధ్యతగా భావించాలి

**• జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**


మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

ఖానాపూర్, జూలై15 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడాన్ని ప్రతీఒక్కర బాధ్యతగా భావించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ శివారులోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గ్రీన్స్ ఫీల్డ్ స్టేడియం ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ సిబ్బంది, ప్రభుత్వ ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

### చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్లలోని పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు

నిర్మల్ చైన్‌గేట్: జిల్లాలోని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ల (సీసీఐఎస్)లో వసతి పొందుతున్న చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని 44మంది అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. దీంతో వారు ప్రభుత్వంతోపాటు గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ఏకంగా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యసేవలు పొందే అర్హత కలిగారని తెలిపారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేసిన రెండో జిల్లా నిర్మల్ కావడం గర్వకారణమన్నారు.

### రోడ్డును ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకెవాలి

భైంసా రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : భైంసా నుంచి కామోల్‌కు వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డుపై అక్రమంగా గోడ నిర్మించినవారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు ఆర్డీవోకి, మున్సిపాలిటీ కమిషనర్, టౌన్ సీఐకి వినతిపత్రం అందజేశారు. దీనిపై వెంటనే స్పందించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

### ఘనంగా యువజన నైపుణ్య దినం

కుంటాల, జూలై15 (ఆంధ్రజ్యోతి): కుంటాల ఆదర్శ మోడల్ పాఠశాలలో మంగళవారం యువజన నైపుణ్య దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలురకాల ప్రదర్శనలను ప్రదర్శించారు. విద్యార్థులు చేపట్టిన కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

### ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

తానూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బామ్ని గ్రామానికి చెందిన కొత్తిమీర గౌతం (35) మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మృతుడు గౌతం కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరుచూ ఇంట్లో గొడవలు జరగడంతో మనస్థాపానికి గురై గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి అన్న సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు, కూతురు ఉన్నారు.

### దొంగతనం కేసులో ఒకరి అరెస్టు

తానూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోంద్రట్ గ్రామానికి చెందిన సొంకంబ్లే రాహుల్‌ను దొంగతనం కేసులో అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జుబేర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న బోంద్రట్ గ్రామానికి చెందిన జంగ్మే సావిత్రిబాయి ఇంట్లో దొంగతనానికి పాల్పడి 70వేల నగదుతోపాటు 10 గ్రాముల బంగారు చెవి కమ్మలు, 10 గ్రాముల వెండి గొలుసులు, 12 గ్రాముల వెండి చేతి కడియాలు దొంగలించినట్లు పేర్కొన్నారు. బోంద్రట్ ఎక్స్ రోడ్డు వద్ద గల హైవే పక్కన పొదల్లో గుంత తవ్వి అందులో దాచి పెట్టాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టి ఫింగర్ ప్రింట్ సహాయంతో నిందితున్ని పట్టుకొని విచారించగా తానే దొంగలించినట్లు రాహుల్ ఒప్పుకున్నారు. అతనినుంచి దొంగలించిన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముథోల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారేగాం గ్రామ ఎక్స్ రోడ్ సమీపాన మంగళవారం కేజీవీల్ ట్రాక్టర్, టాటా ప్యాసింజర్ ఆటో ఢీకొనడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ముథోల్ నుండి కూలీలు నాటు వేసేందుకు కారేగాం వైపు ప్యాసింజర్ ఆటోలో బయలుదేరారు. కారేగాం ఎక్స్ రోడ్ వద్ద కేజీవీల్ ట్రాక్టర్ మూల మలుపు నుంచి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అయితే ఆటోలో ప్రయాణిస్తున్న ముథోల్‌కు చెందిన కూలీలు ఎల్లప్ప, పోశెట్టి, స్వరూపలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### ట్రాక్టర్ పైనుంచి పడి ఒకరికి..

దిలావర్‌పూర్, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ తండాకు చెందిన రామావత్ శౌర్య ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి గాయపడ్డాడు. మంగళవారం ఉదయం వరినాటు కోసం పొలం దమ్ము చేసేందుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో చేయి విరగడంతో 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

### దుబాయ్‌లో పొన్కల్ వాసి మృతి

మామడ, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ (46) అబుదాబిలో గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. ఓ కంపెనీలో పనిచేస్తున్న శ్రీనివాస్ ఒక్కసారి కుప్పకూలి మృతిచెందాడు. బతుకుదెరువు కోసం గల్ఫ్‌బాట పట్టిన శ్రీనివాస్ మృతదేహాన్ని తెచ్చేందుకు గల్ఫ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాట్లు చేస్తోంది.


పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

పెంబి, జూలై15 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం పెంబి మండల కేంద్రంలో రైతువేదిక కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాల, మందపల్లి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఎంఈవో రాంచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సల్ల స్వప్నిల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తులాల శంకర్, సుతారి రమేష్, మేరనర్సయ్య, స్వామి, చారి, తదితరులు ఉన్నారు.

### కడెం ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

కడెం: మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ నీటిని ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఖరీఫ్‌లో అన్ని పంటలను సాగు చేయాలన్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9కోట్ల 46లక్షలు ఖర్చు చేసిందన్నారు. త్వరలో పూడికను తొలగిస్తామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో పేదలకు అందించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద సెప్టిక్ ట్యాంక్ పనులకు భూమి పూజచేశారు. తదనంతరం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోలార్ పెన్సింగ్ పనులకు భూమిపూజ చేశారు.

### కడెంలో ఖానాపూర్ ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

మండల కేంద్రంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పొద్దున్నే బొజ్జన్న అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం కడెం మండలకేంద్రంతోపాటు పెద్దూరులో కూడా మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తామన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ భూమన్న, కాంగ్రెస్ నాయకులు పి. సతీష్‌రెడ్డి, వాజిద్ ఖాన్, బబ్లు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

### కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

ముథోల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని డీఐఈవో పరశురాం అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం డీఐఈవో పరశురాం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రూపులవారీగా విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించి సంబంధిత వివరాలను నూతనంగా వచ్చిన ప్రిన్సిపాల్ కనకమహాలక్ష్మి, అధ్యాపకులకు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ అధ్యాపకులు కళాశాలలో విధిగా సమయపలన పాటిస్తూ విద్యార్థుల సంఖ్య పెంచాలని, సిలబస్ ప్రకారం పాఠాలు బోధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మేరాజ్ మహమూద్, గంగాధర్, శ్రీనివాస్, ప్రశాంత్, ర హిమాన్, నారాయణ, అనిల్, గణేష్, సురేష్ ఉన్నారు.


అధ్యాపకులతో డీఐఈవో పరశురాం

## ట్రాఫిక్ సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

**• ప్రతీ కేసును సమగ్రంగా విచారించాలి: ఎస్పీ**

నిర్మల్‌రూరల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, ట్రాఫిక్ సమస్యలపై ఎస్పీ డా.జి.జానకీ షర్మిల జిల్లా పోలీస్ అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా మిస్సింగ్ కేసులు, బీఎన్‌ఎస్ఎస్ సెక్షన్ 194 కింద ఉన్న కేసుల పురోగతిపై సమగ్రంగా ఆరా తీసినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేకదృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గంజాయి వినియోగంపై కఠినచర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రతీ కేసుపై సమగ్ర విచారణ జరిపి విచారణను వేగవంతం చేసి కోర్టుల్లో సమర్థవంతంగా సమర్పించాలని తెలిపారు. విచారణలో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పెండింగ్ కేసులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని, ప్రతీ కేసుపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఇన్స్‌పెక్టర్లకు, ఎస్‌హెచ్‌వోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమీక్ష సమావేశంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్స్‌పెక్టర్లు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.


జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

### యూరియా వాడకాన్ని తగ్గించాలి

సోన్, జూలై15 (ఆంధ్రజ్యోతి): సోన్ మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలని చెప్పారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. అలాగే కూచన్‌పల్లిలో పలు పంట పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో ఏడీఏ విద్యాసాగర్, ఏవో వినోద్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

### పీఏసీఎస్ చైర్మన్, సీఈవోకు అవార్డు

తానూర్, జూలై15 (ఆంధ్రజ్యోతి): తానూర్ పీఏసీఎస్ సొసైటీకి బెస్ట్ అప్రిషియేషన్ అవార్డు దక్కింది. 44వ నాబార్డు వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా సొసైటీ చైర్మన్ నారాయణ్‌రావు పటేల్, సీఈవో భూమయ్యలు అవార్డు అందుకున్నారు. జిల్లాలో రుణాలు, రికవరీలో మంచి ఫలితాన్ని కనబర్చినందుకు అవార్డు దక్కినట్లు చైర్మన్ నారాయణ్‌రావుపాటిల్ పేర్కొన్నారు.


మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చైర్మన్, సీఈవో


ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి

### ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు

దిలావర్‌పూర్, జూలై15 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ సాగువైపు దృష్టి సారించాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి బీవీ రమణ అన్నారు. మండలంలోని మాడెగాంలో కమల బాయి అనే మహిళా రైతు క్షేత్రంలో మంగళవారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎకరం సాగయ్యే నీటితో మూడు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు సాగు చేయొచ్చన్నారు. మొక్కలు నాటిన నాల్గో ఏడాది దిగుబడి మొదలవుతుందని, ఆసక్తి గల రైతులకు ఉద్యానశాఖ మొక్కలు రాయితీ ఇవ్వడంతో పాటు నాలుగేళ్ల వరకు ఆయిల్‌పామ్ మొక్కల సాగు, అంతర పంటలసాగు ఖర్చు కోసం రూ.4,200 ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నిర్మల్ డివిజన్‌ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి మౌనిక, మాజీసర్పంచ్ ఉత్తమ్‌రావు పటేల్, రైతులున్నారు.

## ఘనంగా బోనాల పండుగ


బాసరలో బోనాలతో వెళ్తున్న మహిళలు


కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో బోనాల పండుగలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కుంటాల, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నెత్తిన బోనాలతో గ్రామదేవతల ఆలయాలకు వెళ్లారు. పలువురు విద్యార్థులు పోతరాజుల వేషాధారణలో పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగని, ఇది మాతృదేవికి ఇచ్చే నైవేద్యమని, పాలుబెల్లంతోపాటు మట్టి పాత్రలు నైవేద్యం తయారుచేసి గ్రామ దేవతలకు సమర్పిస్తారని, ప్రతీయేటా ఆషాఢ మాసంలో బోనాల పండగను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాసరలో ఘనంగా బోనాలు

బాసర: మండలకేంద్రంలో మంగళవారం బోనాల పండుగ వేడుకలు గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో మేళ తాళాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. బాసరలో ప్రధానవీధుల గుండా నృత్యాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి బోనాలు సమర్పించారు. 29 కులసంఘాల ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి గ్రామంలోని పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించి సంప్రదాయ బద్ధంగా పండుగను జరుపుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతుల ఇంటిల్లిపాలిట ఆనందాలు వెల్లువిరవాలని మొక్కులు చెల్లించుకున్నారు.